మున్సిపల్ వైస్ చైర్మన్ రాజీనామా

- జిల్లా అదనపు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్లకు రాజీనామా పత్రాలు అందజేత

అదనపుకలెక్టర్ ప్రతిమాసింగ్‌కు రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న వైస్‌చైర్మన్ యాదగిరి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 2 : ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్ చైర్మన్ పదవికి ఆకుల యాదగిరి మంగళవారం రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, మున్సిపల్ కమిషనర్‌కు రవీంద్రసాగర్‌లకు రాజీనామా లేఖలు అందజేశారు. ఈ సందర్భంగా ఆకుల యాదగిరి మాట్లాడుతూ..ఇబ్రహీంపట్నం మున్సిపల్ కౌన్సిల్‌లో మోసపూరిత రాజకీయాలు నడుస్తున్నాయని, ఈ పరిస్థితిలో తాను వైస్ చైర్మన్‌గా కొనసాగలేనని ప్రకటించారు. సహచర కౌన్సిలర్లే రాజకీయ విలువలు పాటించటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్ చైర్మన్‌పై మెజార్టీ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అవిశ్వాస తీర్మానంపై ఈనెల 4న బల పరీక్ష నిర్వహణకు అధికారులు ఆదేశాలు జారీచేశారు.

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి

ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు, ఏప్రిల్ 2 : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని ఆకుతోటపల్లి గ్రామంలో సూరమంబ సాహిత కంఠమహేశ్వరస్వామి విగ్రహ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అతడిని సన్మానించారు. ఆలయ అభివృద్ధికి ఆలయ కమిటీ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే రూ.10 వేల ఆర్థికసాయం అందజేశాడు. కార్యక్రమంలో ఎంపీటీసీ దోనాదుల కుమార్, నాయకుడు లాలయ్యగౌడ్, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు వీరేశ్‌గౌడ్, శేఖర్ గౌడ్, శ్రీను గౌడ్, రవి గౌడ్, తిరుపతి గౌడ్, బాలరాజు గౌడ్, కృష్ణగౌడ్, నారాయణ గౌడ్ పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

సమావేశంలో మాట్లాడుతున్న రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణ

పెద్దఅంబర్‌పేట, ఏప్రిల్ 2: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని, జనాభా ప్రాతిపదికన వారికి నిధులు కేటాయించాలని తెలంగాణ రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ కోరారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తారామతిపేట గ్రామ రజక సంఘం సమావేశం బాలయ్య అధ్యక్షతన మంగళవారం సంఘం కార్యాలయంలో నిర్వహించారు. సమావేశంలో బండారి పెంటయ్య, బాల మల్లేశ్, కృష్ణ, రాములు, వీరయ్య, అంజయ్య, సత్తయ్య, నర్సింహ, విక్రమ్, సురేశ్, గణేశ్ పాల్గొన్నారు.

ఆకతాయిల అడ్డా.. బస్తీ దవాఖాన..

- దవాఖానలో మద్యం సీసాలు
- సెలవు రోజుల్లో మందుబాబులకు నెలవుగా ఆస్పత్రి
- చర్యలు తీసుకోవాలని స్థానికుల విజ్ఞప్తి

తుర్కయాంజాల్, ఏప్రిల్ 2 : ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యతనిచ్చి గత బీఆర్ఎస్ ప్రభుత్వం బస్తీ దవాఖానలు ఏర్పాటు చేసింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హయాంలో బస్తీ దవాఖానలు ప్రజల ఆదరణ చూరగొన్నాయి. ఎక్కడో దూర ప్రాంతానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగా నెలకొల్పిన బస్తీ దవాఖానల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం వాటి పరిస్థితి బస్తీ దవాఖానల నిర్వహణ ఆశించిన స్థాయిలో లేకపోవడంతో సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి కమ్మగూడ ఇందిరమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానలో ఆకతాయిల ఆగడాలు పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా సెలవు రోజుల్లో మందుబాబులు మద్యం తాగి ఖాళీ మద్యం బాటిళ్లను బస్తీ దవాఖానలోనే వదిలివెళ్తున్నారని ఇందిరమ్మ కాలనీ బస్తీ దవాఖాన సిబ్బంది పేర్కొంటున్నారు. అంతేగాక గుర్తు తెలియని వ్యక్తులు బస్తీ దవాఖాన డోర్‌ను సైతం బద్దలు కొట్టారు. దీంతో ఆకతాయిలు బస్తీ దవాఖానలోకి ప్రవేశించడానికి అవకాశం దొరుకుతుందని వెంటనే డోర్‌ను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. రాత్రి సమయాల్లో పోలీస్‌ల పర్యవేక్షణ సరిగ్గా లేకపోవడంతోనే ఆకతాయిల ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు పట్టించుకొని ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

కమ్మగూడ ఇందిరమ్మ కాలనీలో ధ్వంసమైన బస్తీ దవాఖాన డోర్

దవాఖాన ఆవరణలో ఉన్న వ్యర్థాలు

ఆకతాయిలతో ఇబ్బందులు పడుతున్నాం

ఇందిరమ్మ కాలనీలోని బస్తీ దవాఖానలో ఆకతాయిల ఆగడాలతో ఇబ్బందులు పడుతున్నాం. సెలవుల మరుసటి రోజు దవాఖానలో మద్యం సీసాలు ఉంటున్నాయి. పలువురు దవాఖానలో పడుకొని దుప్పట్లను దవాఖానలోనే వదిలి వెళ్తున్నారు. దవాఖానలో చాలా విలువైన మందులు ఉంటాయి ఆకతాయిల వలన అవి ధ్వంసమయ్యే అవకాశం ఉంది. మున్సిపల్ అధికారులు, పోలీసు అధికారులు దృష్టి సారిస్తే ఆకతాయిల ఆగడాలను అడ్డుకోవచ్చు.

– సృజన, మెడికల్ ఆఫీసర్

అగ్నిమాపక శాఖలో ఎంపికైన ఆమనగల్లు వాసి

గడిగ లక్ష్మణ్

ఆమనగల్లు, ఏప్రిల్ 2: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గతంలో తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా అగ్నిమాపక శాఖలో నిర్వహించిన ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల లిస్టును సోమవారం రాత్రి విడుదల చేసింది. ఆమనగల్లు పట్టణానికి చెందిన గడిగ మంగమ్మ నర్సింహగౌడ్ దంపతుల రెండో కుమారుడు గడిగ లక్ష్మణ్ డ్రైవర్ ఆపరేటర్ కానిస్టేబుల్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గడిగ లక్ష్మణ్‌ను స్థానికులు అభినందించారు.

అతివేగంతో బైక్‌ను ఢీకొన్న లారీ

- ఇద్దరికి తీవ్రగాయాలు

చేవెళ్ల రూరల్, ఏప్రిల్ 2 : బైకును వెనుక నుంచి లారీ ఢీ కొనడంతో బైక్ పై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన చేవెళ్ల మండల పరిధి అల్లవాడ గేట్ సమీపంలో మంగళవారం జరిగింది. ఎస్ఐ ప్రదీప్ కుమార్ వివరాల ప్రకారం.. షాబాద్ మండలం ఎర్రోని గూడ గ్రామానికి చెందిన ముకుటం సోమయ్య (70), ముకుటం నర్సింహులు హరికథలు చెబుతూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం ఉదయం 8: 40 గంటలకు వారిద్దరూ చేవెళ్ల నుంచి షాబాద్‌కు వారి ద్విచక్ర వాహనం (టీఎస్07జేబీ9013) పై వెళ్తున్న క్రమంలో అల్లవాడ గేట్ సమీపంలో వెనుక నుంచి అతి వేగంగా దూసుకొచ్చిన లారీ (కేఏ562285)ఢీ కొట్టడంతో ఇద్దరి కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. లారీ నడుపుతున్న డ్రైవర్ బీదర్‌కు చెందిన పండరీనాథ్‌గా గుర్తించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాపన్నగౌడ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

ఆమనగల్లు హైదరాబాద్– శ్రీశైలం జాతీయ రహదారిపై సర్దార్ పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

చేవెళ్లటౌన్, ఏప్రిల్ 2: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీపీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, ఎంపీటీసీ వసంతం అన్నారు. వర్ధంతి సందర్భంగా చేవెళ్ల మండల కేంద్రంలోని పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వీరేందర్‌రెడ్డి, గుండాల రాములు, పాండు యాదవ్, మల్లేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బహుజన వీరుడు సర్వాయి పాపన్న గౌడ్

ఆమనగల్లు : బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని గౌడ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు చుక్క అల్లాజీగౌడ్ అన్నారు. మంగళవారం ఆమనగల్లు పట్టణంలోని హైదరాబాద్– శ్రీశైలం జాతీయ రహదారిపై పాపన్న గౌడ్ యువజన సంఘం అధ్యక్షుడు గుండ్రాతి కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చుక్క నిరంజన్‌గౌడ్, దూసకంటి యాదయ్య, మున్సిపల్ అధ్యక్షుడు వెంకటయ్య గౌడ్, నాగిళ్ల లక్ష్మణ్, రాజేశ్, అల్లాజీ, కుమార్, నాగయ్య, రాజు, శ్రీశైలం, పరమేశ్, నిరంజన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కులం, ఆదాయం సర్టిఫికెట్ల అందజేత

కులం, ఆదాయ సర్టిఫికెట్లను అందజేస్తున్న యాదయ్య, భాస్కర్

మంచాల, ఏప్రిల్ 2 : మండల పరిధిలోని జాపాల గ్రామంలో పదోతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు గ్రామానికి చెందిన రెవెన్యూ ఉద్యోగి యాట భాస్కర్, గ్రామస్తుడు లింగంపల్లి యాదయ్య తమ సొంత ఖర్చులతో కులం, ఆదాయం సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

యాచారం, ఏప్రిల్ 2 : మండలంలోని తులేఖుర్దుగ్రామంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతిని పురస్కరించుకొని సందర్భంగా ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంకు చెంది లిమ్స్ దవాఖాన సమక్షంలో ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య నిపుణులు బీపీ. షుగర్, గుండె, జనరల్ తదితర పరీక్షలు సుమారు 160 మందికి నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు ఎంజే వినోద్‌కుమార్ మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లిమ్స్ దవాఖాన ఎండీ విశ్వనాథ్, డాక్టర్ లోకేశ్, నాయకులు శ్రీనివాస్, విజయ్‌కుమార్, బుగ్గరాములు, రూపేందర్, భగత్ తదితరులున్నారు.

భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

580 గ్రాముల గంజాయి స్వాధీనం

- గంజాయి విక్రయ స్థావరంపై ఎస్‌వోటీ పోలీసుల దాడి
- అదుపులో ఇద్దరు నిందితులు

రేకుల షెడ్డులో గంజాయి పట్టుకున్న పోలీసులు

మొయినాబాద్, ఏప్రిల్ 2 : గంజాయి విక్రయ స్థావరంపై ఎస్‌వోటీ పోలీసులు దాడి చేసి 580 గ్రాముల గంజాయి, 92 గంజాయి చాక్లెట్ ప్యాకెట్లు, ఐదు సెల్‌ఫోన్లు, రూ.4500 నగదును స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన మండల పోలీస్‌స్టేషన్ పరిధిలోని తోలుకట్టా గ్రామ శివారులో సోమవారం రాత్రి జరిగింది. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి కథనం ప్రకారం.. బీహార్ రాష్ట్రంలోని సహర్సా జిల్లా పరిధి లోని మొర్కాహి గ్రామానికి చెందిన సౌరభ్‌కుమార్‌యాదవ్ 20 ఏండ్ల క్రితం మొయినా బాద్‌కు వలసొచ్చి తోలుకట్టా గ్రామ శివారులో చనువెల్లి రాంచందర్ వ్యవసాయ పొలం లో ఉన్న రేకుల షెడ్‌ను అద్దెకు తీసుకుని జీవిస్తున్నాడు. అతడు తోలుకట్టా గేట్ వద్ద ఉన్న మాణిక్యం అనే వ్యక్తి వెల్డింగ్ షాపులో పని చేస్తున్నాడు.

గంజాయి తినేవారిని లక్ష్యంగా చేసుకుని..

తనతోపాటు పనిచేసేవారు.. వ్యవసాయ క్షేత్రాల్లో పనులు చేసే వివిధ రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు గంజాయికి అలవాటు పడినట్లుగా గమనించిన సౌరభ్‌కుమార్ అదనపు ఆదా యం కోసం గంజాయిని విక్రయించడం ప్రారంభించాడు. బీహార్ లోని సుబోధ్‌సింగ్ అలి యాస్ సుబోధ్ ఖోప్రియా అనే వ్యక్తి నుంచి గంజాయి, గంజాయి చాక్లెట్ ప్యాకెట్లు కొను గోలు చేసి వాటిని చిన్న, చిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తూ ఆదాయాన్ని పొందుతున్నాడు. విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు రాజేంద్రనగర్ ఎస్‌వోటీ పోలీసులు గంజా యి విక్రయిస్తున్న స్థావరంపై సోమవారం రాత్రి దాడి చేసి గంజాయి అమ్ముతున్న సౌరభ్‌కుమార్‌ను.. కొనుగోలు చేసేందుకు వచ్చిన ముజ్తాబా అలీఖాన్ అలియాస్ ప్రిన్స్ ను రెడ్‌హ్యాండ్‌గా పట్టుకున్నారు. 580 గ్రాముల గంజాయితోపాటు 92 గంజాయి చాక్లెట్ ప్యాకెట్లు, గంజాయి ప్యాకెట్లు తయారు చేసే మిషన్, రూ.4500 నగదును, 5 సెల్‌ఫో న్ లను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.80 వేల వరకు ఉంటుం దన్నారు. వాటిని స్థానిక పోలీసులకు అప్పగించారు.

గంజాయి కొనేందుకు వచ్చి దొరికిన పాత నేరస్తుడు

హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ముజ్తాబా అలీఖాన్ అలియాస్ ప్రిన్స్ అనే యువకుడు సెల్‌ఫోన్లను చోరీ చేస్తూ పది కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. బీహార్ రా ష్ట్రానికి చెందిన ముజ్తాబా అలీఖాన్ లంగర్‌హౌస్‌లోని బాగ్దాద్‌కాలనీలో నివాసం ఉంటు న్నాడు. అతడు దొంగిలించిన సెల్‌ఫోన్లను సౌరభ్‌కుమార్ వద్ద పెట్టి గంజాయిని కొనేందుకు వచ్చాడు. దీంతో పోలీసులు దాడి చేసి సమయంలో అతడు వారికి దొరికిపోయాడు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మంచాల, ఏప్రిల్ 2 : మండల పరిధిలోని బోడకొండ గ్రామంలో తెలంగాణ సివిల్‌సప్లయ్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం డీసీఎంఎస్ వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని జిల్లా ఇన్‌చార్జి డీసీఎంఎస్ రామకృష్ణరాజు అన్నారు. కార్యక్రమంలో అధికారులు వెంకటేశ్, వెంకటరాజు, జగన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

షాబాద్ :ఓట్ ఫర్ ష్యూర్ అనే నినాదంతో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

షాద్‌నగర్‌టౌన్, ఏప్రిల్ 2 : ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని షాద్‌నగర్ ఆర్డీవో వెంకటమాధవరావు అన్నారు. ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు షాద్‌నగర్ మినీ స్టేడియం నుంచి పట్టణ ముఖ్యకూడలి వరకు మంగళవారం నిర్వహించిన 5కే రన్ కార్యక్రమంలో తహసీల్దార్ పార్థసారథి, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి, అధికారులతో కలిసి పాల్గొని మాట్లాడారు. ప్రజాస్వాయంలో మెరుగైన సమాజాన్ని నెలకొల్పడంలో ఓటు హక్కు వజ్రాయుధంగా ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును పొంది ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడాలన్నారు. పట్టణ ముఖ్యకూడలిలో మానవహారంగా ఏర్పడిన అనంతరం ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓట్ ఫర్ ష్యూర్ అనే నినాదంతో ర్యాలీ

షాబాద్ : పార్లమెంట్ ఎన్నికలు–2024 స్వీప్‌లో భాగంగా ఓట్ ఫర్ ష్యూర్ అనే నినాదంతో భారత ఎన్నికల కమిషన్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు (స్వీప్)ఓటరు భాగస్వామ్యం, అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం శంకర్‌పల్లి మున్సిపల్ కార్యాలయం నుంచి మార్కెట్ రోడ్డు, ప్రధాన చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసీల్దార్ సురేందర్, ఎంపీడీవో వెంకయ్య, సీఐ అబిబుల్లాఖాన్, మేనేజర్ అంజన్‌కుమార్, ఏపీవో నాగభూషణం, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, మెప్మా ఆర్‌పీఎస్ గ్రూప్ సభ్యులు, పాఠశాల విద్యార్థులు, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌టౌన్ : 5కే రన్ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీవో వెంకటమాధవరావు

లే అవుట్‌ను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, ప్లాట్ల యజమానులు

షాబాద్, ఏప్రిల్ 2 : బీడీఎడ్ వెల్ఫేర్ అసోసియేషన్ లే అవుట్‌ను ధ్వంసం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, ప్లాట్ల యజమానులు మంగళవారం శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. శంకర్‌పల్లిలోని సర్వే నంబర్లు 208, 209, 210, 211, 212, 213 (పార్ట్ సర్వే నంబర్‌లో కొంత భాగం) 242(పార్ట్), 243(పార్ట్)ల్లో 18ఎకరాల 38గుంటల భూమిని 2011 సంవత్సరంలో కొనుగోలు చేశామని వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. 2013 సంవత్సరంలో హెచ్ఎండీఏ నుంచి లే అవుట్‌కు పూర్తి చేసి అనుమతులు వచ్చాయని వివరించారు. లే అవుట్ చేసిన 13 సంవత్సరాల తదనంతరం సర్వేనెంబర్ 242(పార్ట్)లోని మూడు ఎకరాల భూమి తనది అంటూ తోట శ్రీనివాస్‌రెడ్డి తమను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని వాపోయారు. ఈ నెల 1వ తేదీన శ్రీనివాస్‌రెడ్డి అతడి అనుచరులతో కలిసి లే అవుట్‌లోని పార్కు స్థలం, డ్రైనేజీ పైపులు, ప్లాట్ చుట్టూ నిర్మించిన ప్రహరీ, బీటీ రోడ్డును జేసీబీతో ధ్వంసం చేశాడని తెలిపారు. 12 ఫీట్ల ఐరన్ రాడ్లతో ప్లాట్ల చుట్టూ గోతులు తీసి ప్రహరీని నిర్మించేందుకు ప్రయత్నిస్తుండగా సాయంత్రం తమకు సమాచారం అందగా అక్కడికి వెళ్లామని చెప్పారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించామన్నారు. లేఅవుట్ ధ్వంసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉరేసుకుని వలస కార్మికుడి ఆత్మహత్య

నందిగామ, ఏప్రిల్ 2: ఉరి వేసుకొని ఓ వలస కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన నందిగామ పోలీస్ స్టేషన్ పరిధిలోని వీర్లపల్లి జాగృతి స్టీల్ పరిశ్రమ వద్ద మంగళవారం వెలుగు చూసింది. నందిగామ పోలీసుల వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన రమేశ్ (25) రెండేండ్లుగా వీర్లపల్లి శివారులోని జాగృతి స్టీల్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. అయితే మంగళవారం స్టీల్ పరిశ్రమ సమీపంలోని గృహంలో ఉరివేసుకొని మృతిచెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఇఫ్తార్ విందు మతసామరస్యానికి ప్రతీక

ఇఫ్తార్ విందుకు హాజరైన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

తుర్కయాంజాల్ , ఏప్రిల్ 2 : మున్సిపాలిటీ కో ఆప్షన్ సభ్యుడు మీర్ సుజాత్ అలీ ఆధ్వర్యంలో తుర్కయాంజాల్ మసీద్ వద్ద మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీక అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా నిర్వహించిన పూజలో సత్తయ్య కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో అయ్యప్ప దేవాలయ కమిటీ సభ్యు లు, కాలనీ వాసులు పాల్గొన్నారు. – తుర్కయాంజాల్, ఏప్రిల్ 2

భూవివాదం కేసులో కన్నారావు అరెస్టు

ఆదిబట్ల, ఏప్రిల్ 2: ఓభూవివాదం కేసులో నెల రోజులుగా పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్న కల్వకుంట్ల తేజేశ్వర్‌రావు అలియాస్ కన్నారావును మంగళవారం ఆదిబట్ల పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎదుట ప్రవేశపెట్టగా 14 రోజుల రిమాండ్ విధించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని మన్నెగూడలోని సర్వేనంబర్–32లో రెండు ఎకరాల 17 గుంటల స్థలానికి సంబంధిం చిన వివాదంలో ఆదిబట్ల పోలీసులు మార్చి3వ తేదీన 38 మందిపై కేసు నమోదు చేశారు. అందులో ఏ4గా కల్వకుంట్ల తేజేశ్వర్‌రావు అలియాస్ కన్నారావును చేర్చారు. అతడితో పాటు 37మందిపై 307, 447, 427, 436, 148, 149 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. దీంతో కన్నారావు పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. రెండుసార్లు హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా రాష్ట్ర ధర్మాసనం తిరస్కరించింది. దీంతో కన్నారావు ఇతర దేశాలకు వెళ్లకుండా పోలీసులు ముందుగానే లుక్‌అవుట్ నోటీసులు జారీచేశారు. మంగళవారం కన్నారావు నగరంలోని బాలాపూర్‌లో ఉన్న ఓఅడ్వకేట్‌ను కలిసేందుకు రాగా పక్కా సమాచారంతో సీఐ రాఘవేందర్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి కన్నారావును అదుపులోకి తీసుకున్నారు.

లొంగిపోయా .. పోలీసులు అరెస్టు చేయలేదు..

నేనే లొంగిపోయా. పోలీసులు అరెస్టు చేయలేదు. బాలాపూర్‌లో ఉన్నట్లు ఆదిబట్ల పోలీసులకు ఫోన్ చేసి చెప్పడంతో వారు వచ్చి అదుపులోకి తీసుకున్నారు. ఎలాంటి తప్పు చేయలేదు. ఆ భూమిపై నాకు పూర్తి హక్కులున్నాయి. ఈ కేసుపై హైకోర్టును ఆశ్రయించా. న్యాయం జరుగుతుందనే నమ్మకం ఉన్నది. నేను డెవలప్‌మెంట్‌కు తీసు కున్న కొంత భూమి విషయంలో గొడవ జరుగుతున్నది. –కల్వకుంట్ల తేజేశ్వర్‌రావు అలియాస్ కన్నారావు